

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి
- ఎమ్మెల్సీ మధుసూదనాచారి
8లో..

ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా సీతారామయ్య
8లో..



ప్రత్యేక అధికారుల నియామకాల్లో
గందరగోళం

- ప్రభుత్వ ఉత్తర్వులు బేఖాతరు
- నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు బాధ్యతలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన తీసుకవచ్చింది. జిల్లాలో ప్రత్యేక అధికారులను నియమించడంలో సంబంధిత అధికారులు గందరగోళానికి గురవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గెజిటెడ్ స్థాయి అధికారులనే ప్రత్యేక అధికారులుగా నియమించాలి. కానీ అందుకు విరుద్ధంగా జిల్లా స్థాయి అధికారులను, నాన్‌గెజిటెడ్ అధికారులను నియమిస్తుండడం గందరగోళంగా మారింది. ఈ విషయంలో సంబంధిత అధికారుల మధ్య సమన్వయం లోపించినట్లుగా కనబడుతున్నది. జిల్లాలో 267 గ్రామపంచాయతీలుండగా, 263 పంచాయతీలకు మాత్రమే పాలక వర్గాలున్నాయి. వీటి పదవీకాలం ఈనెల 1వ తేదీ నాటితో ముగిసింది. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితి నెలకొన్నది. పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించింది. అలాగే పంచాయతీరాజ్ చట్టంలో చేర్పులు, మార్పులు తీసుకవచ్చిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నది. ప్రత్యేకాధికారుల పాలన తీసుకవస్తుందా, పర్సన్ ఇన్‌చార్జీలను నియమిస్తారా అంశం సమీక్షించిన ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన వైపే మొగ్గు చూపింది. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖ ఈఈలు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీవోలు, పంచాయతీరాజ్ మిషన్ భగీరథ అధికారులు, విద్యుత్‌శాఖ అసిస్టెంట్‌ఇంజినీర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మండల విద్యాధికారులు, వ్యవసాయ శాఖాధికారులు, పశువైద్య శాఖాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఉద్యాన శాఖాధికారులను నియమించాలని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆ మేరకు ప్రత్యేక అధికారులను నియమించడంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి పైరానాకు గురైనట్లుగా కనబడుతున్నది. వివిధ శాఖల మండల కార్యాలయాల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సూపరింటెండెంట్లు, వ్యవసాయ విస్తరణాధికారులను కూడా పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఇలా అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి, ఎక్లాస్‌పూర్, పొట్యాల, ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి, కొత్తపల్లిన్యూ, ఖిలావనపర్తి, నర్సింహులపల్లి, కొత్తూరు, నర్సింహులపల్లి, నాయకంపల్లి, పైడిచింతలపల్లి, రచ్చపల్లి, శాయంపేట్, ఎలిగేడు మండలం బుర్హన్‌మియాపేట్, లోకపేట, నారాయణపల్లి, జూలపల్లి మండలం కీచులాటపల్లి, చీమలపేట, కమాన్‌పూర్ మండల గొల్లపల్లి, మంథని మండలం బట్టుపల్లి, ఖాన్‌సాయిపేట్, లక్కేపూర్, మల్లెపల్లి, నాగారంపల్లి, పోతారం గ్రామాల్లో నియమించారు. ముత్తారం మండలం హరిపురం, లక్కారం, ఓదెల మండలం బాయమ్మపల్లి, బీమరపల్లి, నాంసానిపల్లి, పాలకుర్తి మండలంలో పాలకుర్తి, ఉండేడ, పెద్దపల్లి మండలం అందుగులపల్లి, చీకురాయి, గౌరెడ్డిపేట, మూలసాల, నిమ్మనపల్లి, రాంపెల్లి, కాల్వశ్రీరాంపూర్ మండలం అంకంపల్లి, జాఫర్‌ఖాన్‌పేట్, ఇప్పలపల్లి, లక్ష్మీపూర్, మడిపల్లి, పేద్దంపేట్, సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి, గొల్లపల్లి, నారాయణపూర్ గ్రామాలకు నాన్‌గెజిటెడ్ ఉద్యోగులను నియమించడం గమనార్హం.

● జిల్లా అధికారులకూ..

ప్రత్యేక అధికారులుగా జిల్లా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారికి ఎలిగేడు, జిల్లా మత్స్య అధికారికి గుంజపడుగు, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు కొలనూర్, డీఎంవోకు బసంత్‌నగర్, పరిశ్రమల శాఖ జీఎంకు భోజన్నపేట, సీపీవోకు రాఘవాపూర్, షెడ్యూల్ కులాల సంస్థ ఈడీకి పన్నూర్, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారికి గర్రెపల్లి బాధ్యతలు అప్పగించారు. వివిధ జిల్లాల్లో దాదాపుగా మండల, డివిజన్ స్థాయి అధికారులకే బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరికి ఒక పంచాయతీ బాధ్యతలే ఇచ్చారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి కూడా బాధ్యతలు అప్పగించడం వల్ల ఆయా శాఖల్లో చేపట్టాల్సిన పనులు కుంటుపడే అవకాశాలున్నాయి. జిల్లా అధికారులకు ఇప్పటికే ఆయా మండలాల నోడల్ అధికారులుగా ఉన్నారు. రాష్ట్రమంతటా ఒక విధానం నడుస్తుంటే, పెద్దపల్లి జిల్లాలో అందుకు విరుద్ధమైన విధానాలను అనుసరిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. ఈ విషయమై కలెక్టర్ స్పందించి ప్రత్యేక అధికారుల నియామకాలపై పునఃపరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా ఎగ్జిబిట్స్‌కు బహుమతులు



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 2 : దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న జిల్లా విద్యార్థులు, ఉపాధ్యాయుడు రెండు విభాగాల్లో బహుమతులు సాధించినట్టు డీఈవో డి.మాధవి శుక్రవారం తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్‌లోని విజయవాడలో ఐదు రోజులపాటు నిర్వహించిన ఎస్ఐఎస్ఎఫ్(సదరన్ ఇండియా సైన్స్ ఫేర్)-2023 గురువారం రాత్రి ముగిసినది. పెద్దపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాగినేడు విద్యార్థులు ఆర్.కీర్తన, బి.సాత్విక తమ గైడ్‌టీచర్ కె.జగదీశ్వర్‌రెడ్డి సహాయసహకారాలతో రూపొందించిన పోర్టబుల్ వీల్‌చైర్ ర్యాంప్ ఎగ్జిబిట్ సీనియర్ విభాగంలో తెలంగాణ రాష్ట్ర ఉత్తమ ప్రదర్శనల్లో ఒకటిగా నిలిచి బహుమతి అందుకున్నది. అలాగే బోధనోపకరణాల విభాగం టీచర్ కేటగిరిలో సుల్తానాబాద్ మండలం పూసాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పి.సురేందర్ ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పేరిట ఏర్పాటుచేసిన ప్రదర్శన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వారి ప్రత్యేక బహుమతి పొందినట్టు డీఈవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈవో డి.మాధవి, జిల్లాసైన్స్ అధికారి బి.రవినందన్‌రావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ ఆగయ్య, డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు.

మంత్రిని కలిసిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు



మంత్రి శ్రీధర్‌బాబుకు అభినందనలు చెబుతున్న శ్రీమాన్నారాయణ

పెద్దపల్లి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరు శ్రీమన్నారాయణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును శుక్రవారం సచివాలయంలో కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బీసీ కులగణనతో బీసీ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమైందని అన్నారు. రాష్ట్ర బడ్జెట్లో బీసీలకు 20వేల కోట్లు కేటాయించాలని శ్రీమన్నారాయణ కోరారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నీ పూర్తిచేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాల్లో సత్వరన్యాయం జరగాలంటే కులగణన ద్వారానే సంపూర్ణ సాధికారత లభిస్తుందని అన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

పాలకుర్తి, ఫిబ్రవరి 2: మండలంలోని జీడినగర్ గ్రామపంచాయతీ పరిధిలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ శుక్రవారం తెలిపారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బి కృతజ్ఞ, బి పుష్పలత తెలిపారు. ఈనెల 3,4 తేదీల్లో మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని ఎస్టి అర్నల్స్ ఉన్నత పాఠశాలలో జరగనున్న తెలంగాణ స్టేట్ జూనియర్, ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ బాలికల విభాగంలో వీరు ఆడనున్నారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్ తదితరులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

నేడు సుల్తానాబాద్ మున్సిపాలిటీలో అవిశ్వాస సమావేశం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 2: సుల్తానాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన ముత్యం సునితపై స్వపక్షానికి చెందిన వారితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించడంతో శనివారం సమావేశం జరగనున్నది. మెజారిటీ సభ్యులు అవిశ్వాసం కోరుతూ సంతకాలు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం సమావేశ నిర్వహణ అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం ఉదయం పదకొండు గంటలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మేరకు సభ్యులకు సమాచారం కూడా ఇచ్చారు.

క్యాంప్‌లో కౌన్సిలర్లు..

మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునితపై అవిశ్వాసం ప్రకటించిన బీఆర్ఎస్, కాంగ్రెస్ కౌన్సిలర్లందరూ జనవరి 26న క్యాంప్‌కు తరలివెళ్లారు. క్యాంపు నుంచి నేరుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు మున్సిపల్ ఆఫీసుకు చేరుకుని అవిశ్వాసం పరీక్షలో పాల్గొననున్నారు.

16న మంథని మున్సిపాలిటీలో..

మంథని, ఫిబ్రవరి 2: మంథని మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వైఎస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్‌లపై మెజార్టీ సభ్యులు ఇచ్చిన అవిశ్వాసం నోటీస్‌పై ఈనెల 16న మున్సిపాలిటీలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని జిల్లా ముజమ్మిల్‌ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసమావేశానికి ప్రిసైడింగ్ అధికారిగా మంథని ఆర్డీవో హనుమా నాయక్‌ను నియమించారు. చైర్‌పర్సన్, వైఎస్‌చైర్మన్‌పై మున్సిపాలిటీలోని మెజార్టీసభ్యులు అదనపుకలెక్టర్‌కు అవిశ్వాసం నోటీస్ ఇచ్చిన విషయం విదితమే. ఈనెల 16న జరిగే అవిశ్వాసం ప్రత్యేక సమావేశంపై అందరిలో ఉత్కంఠ నెలకొంది.



సుల్తానాబాద్ మున్సిపల్ కార్యాలయం




నలుగురిపై అదనపు కట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2: అదనంగా వరకట్నం కోసం వేధించిన సం ఘటనలో వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పెర్కవేడు గ్రామానికి చెందిన భర్త వంగాల సుమన్, అత్తామామలు సుగుణ, స్వామి, బావ సునీల్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ శుక్రవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన జ్యోతిని సుమన్ 2023లో ప్రేమ వివాహం చేసుకున్నాడన్నారు. కొంత కాలంగా ఉన్న ఊరిలో ఉపాధి లేకపోవడంతో ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు వలస వచ్చి ఓ గదిని అద్దెకు తీసుకొని కూలీ పనులు చేస్తున్నారని తెలిపారు. మూడు నెలలు భార్యను సరిగా చూసుకున్న భర్త సుమన్ తన తల్లిదండ్రులు, సోదరుడితో కలిసి అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించాడు. బాధితురాలు జ్యోతి ఫిర్యాదుతో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.

నంది పంప్‌హౌస్ నుంచి

గోదావరి జలాల ఎత్తిపోతలు



డెలివరీ సిస్టర్న్ ద్వారా ఎత్తిపోస్తున్న గోదావరి నీరు

ధర్మారం, ఫిబ్రవరి 2: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం లోగల కాళేశ్వరం ప్రాజెక్ట్ నంది పంప్ హౌస్ నుంచి శుక్రవారం సాయంత్రం గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి అండర్ టన్నెల్ ద్వారా నంది పంప్ హౌస్‌లోకి నీటిని విడుదల చేశారు. అక్కడినుంచి రెండో పంపు మోటార్ ద్వారా 3150 క్యూసెక్కుల నీటిని డెలివరీ సిస్టర్న్ గుండా నంది రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నారు. నంది రిజర్వాయర్‌లో నీటి లభ్యత లేదని రిజర్వాయర్ కింద పంటలు సాగు చేసిన ధర్మారం, వెల్గటూర్ మండలాల రైతులు అధికారులకు విన్నవించారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం నంది పంప్‌హౌస్ ద్వారా రిజర్వాయర్‌లోకి నీటి తరలింపు ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట

దళితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న నాగంపేట దళితులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 2: తమ భూమి తమకే ఇవ్వాలని నాగంపేటకు చెందిన దళితులు గంభీరావుపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళనకు దిగారు. 1980-96లో రెండు విడతలుగా అప్పటి ప్రభుత్వాలు సర్వే నంబరు 92/ఏలో ఇళ్ల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించి పట్టాలను ఇచ్చిందన్నారు. అప్పటి నుంచి ఆ స్థలాలల్లో తాత్కాలిక గుడిసెలు వేసుకున్నామని, ఇటీవల ఇళ్లు నిర్మించుకునేందుకు తాము సిద్ధమవుతుంటే అదే గ్రామానికి చెందిన కొందరు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇదేమిటని అడిగితే వేసుకున్న గుడిసెలను తొలగించి, అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. భూమిని తమకే ఇచ్చే విధంగా చూడాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాగంపేటకు చెందిన బాలనర్సు, దేవేంద్ర, దేవరాజు, రాజు, రవి, శంకర్‌బాబు, శేఖర్, రాజవ్వ, లక్ష్మి, లత. లాస్య, చంద్రవ్వ ఉన్నారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 2:మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. వీర్నపల్లికి చెందిన కుటుంబ సభ్యులు ఆటోలో శుభకార్యానికి వెళ్లి వస్తున్నారు.

అటవీశాఖ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిపై అడవి పంది అడ్డుగా రావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న అబ్రహం, ప్రభలత, పుష్ప, సత్తవ్వ, నవనీత, మంజులకు గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న స్థానిక ఎస్‌ఐ రమేష్ ప్రమాదాన్ని గమనించి గాయపడిన వారిని వెంటనే చికిత్స కోసం అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. క్షత గాత్రులను ఆసుపత్రికి తరలించిన ఎస్‌ఐని స్థానికులు అభినందించారు.

ఎలుగుబంటి సంచారం

చందుర్తి, ఫిబ్రవరి 2: మండలంలోని ఎనగల్‌లో ఎలుగుబంటి ప్రజల ను బెంబేలెత్తిస్తోంది. శివాలయం నుంచి మామిడిపల్లి గ్రామం వైపు వెళ్లే దారిలో కొత్తచెరువు, నక్క ఒర్రె ప్రాంతంలో రెండు రోజుల నుంచి ఎలుగు బంటి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శుక్రవారం ఓ రైతు చేనులో పత్తి కర్రను నరికి వేస్తుండగా ఎలుగుబంటి వచ్చింది. భయాందోళనకు గురైన రైతు పరుగెత్తి ఇంటికి చేరుకున్నాడు. ఏ వైపు నుంచి వచ్చి ఎలుగుబంటి దాడి చేస్తుందోనని రైతులు, ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించాలని, ఎలుగుబంటి నిబంధించాలని కోరుకుంటున్నారు.


విజృంభిస్తున్న విష జ్వరాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 2:మండలంలోని పదిరలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంటింటా జ్వరంతో మంచం పట్టారు. మండల కేంద్రంతోపాటు సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ పట్టణాల్లో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్థోమత లేని పేదలు ఇంటికే పరిమితమయ్యారు. గ్రామంలో పారిశుధ్యం లోపించి దోమలు తీవ్రమయ్యాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. వైద్య అధికారులు వచ్చినా నామమాత్రపు పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించిగ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి

గంభీరావుపేట, ఫిబ్రవరి 2 : గిరిజనుల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జన్మదినమైన ఫిబ్రవరి 15ను సెలవు దినంగా ప్రకటించాలని, జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని ఆల్ ఇండియా బంజార సేవ సంఘం అధ్యక్షుడు, సేవాలాల్ సోషల్ సర్వీస్ జిల్లా కన్వీనర్ అజ్మీరా భాస్కర్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.

తెలంగాణ రాష్ట్రంలో 13 శాతం ఉన్న గిరిజనులకు స్థలం కేటాయించాలని, సేవాలాల్ మహారాజ్ భవనాన్ని కట్టించాలని అన్నారు. గత ప్రభుత్వంలో కేవలం హైదరాబాద్‌లో బంజార భవన్ నిర్మించారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రంలో బంజార భవనాన్ని కట్టించి గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు.















జాతీయస్థాయి పోటీలకు కరీంనగర్ మాస్టర్ అథ్లెట్స్




జాతీయ స్థాయికి ఎంపికైన మాస్టర్ అథ్లెట్స్

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 2: హైదరాబాద్‌లోని గచ్చీబౌలి స్టేడియం లో ఈనెల 8 నుంచి 11 వరకు జరిగే జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు మాస్టర్ అథ్లెట్స్ ఎంపికయ్యారు. డిసెంబరు 30,31 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేష్ అధ్యక్ష, కార్యదర్శులు పేర్యాల రవీందర్, నీలం లక్ష్మణ్ తెలిపారు. 30 సంవత్స రాల పైబడిన విభాగంలో ఎల్ సత్య, పి ఝాన్సీ, ఎల్ మానసిక, 35 సం వత్స రాలు పైబడిన వారి విభాగంలో టి రజిత, ఎన్ శ్రీధర్, జి వెంకటే ష్, జి స్వామి, సాయిరాం, 40 సంవత్సరాలు పైబడిన విభాగంలో ఎం రేణుక, కె శోభరాణి, ఎన్ కమల్‌సాగర్, ఎం సంపత్, 45 సంవత్సరాలు పైబడిన విభాగంలో ఎన్ పద్మ, పి రవళి, పి అమరేందర్, ఎ ప్రభాకర్, బి మల్ల య్య, పి చంద్రశేఖర్, ఎ అశోక్, 50 సంవత్సరాలు పైబడిన విభా గంలో సిహెచ్ మునిందర్, 65 పైబడిన విభాగంలో ఎండి షఫి, 80 పై బడిన విభాగంలో ఎన్ వెంకటయ్య ఎంపికయ్యారని వారు తెలిపారు.

రూ.6,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,600 పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 87 మంది రైతులు 938క్వింటాళ్ల విడి పత్తి, ఐదుగురు రైతులు ఐదు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,600, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శని,ఆదివారాలు సాధారణ సెలవు దినాలు కాగా, తిరిగి సోమవారం యార్డులో క్రయ విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

BLOCKBUSTER విజయవంతమైన 4వ వారం



సుదర్శన్ 35ఎంఎం - ఎ/సి ఆర్‌టీసీ క్రాస్‌రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
విశ్వనాథ్ - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45 | కోణార్క్ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.15,6.00,9.15
శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.30,2.30,6.30,9.30 | లక్ష్మి క.మం ఎ/సి - అల్వాల్ 11.30,2.30,6.30,9.30 | ఆరాధన ఎ/సి - తార్నాక 11.00,2.00,6.00,9.00
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ 8.00pm | నెక్లెస్ సత్య - కవాడిగూడ 4.30pm
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి 10.05,1.15,7.30 | అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్ 4.15pm
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 2.05pm | మంజీరామాల్ - కూకట్‌పల్లి 2.00pm
ఫోరం మాల్ - కూకట్‌పల్లి 1.20pm | పి.పి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి 1.50pm
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ 4.15pm | డిఎస్ఎల్ మాల్ - ఉప్పల్ 4.20pm
గలేరియా - పంజాగుట్ట 10.50pm | ఏషియన్ సత్యం - అమీర్‌పేట 1.05,7.20
ఐకాన్ - హైటెక్‌సిటీ 4.40pm | ఏషియన్ సినీమార్ట్ - ఆర్.సి.పురం 7.35pm
పీవీఆర్ - ఎర్రమంజిల్ 1.40pm | సినీ ప్లానెట్ - కొంపల్లి 1.35pm
పీవీఆర్ - ముసారాంబాగ్ 4.30pm | ఏషియన్ సినీస్క్వేర్ - ఉప్పల్ 4.40pm
అట్రియమ్ - గచ్చిబౌలి 4.40pm | ఎంబెఆర్ సినీస్క్వేర్ - నారపల్లి 7.45pm
జి.వి.కె.మాల్ - బంజారాహిల్స్ 4.40pm | లక్ష్మీకళా సినీప్లెక్స్ - మూసాపేట 9.30pm
ఎం.పి మాల్ - కాచిగూడ 1.20pm | జె.పి.సినిమాస్ - చందానగర్ 4.40pm
జిఎస్ఎమ్ - మదీనగూడ 2.15pm

విజయవంతమైన 4వ వారం



సప్తగిరి 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్
సంధ్య 70ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్‌రోడ్స్
మల్లిఖార్జున 70 - కూకట్‌పల్లి | BR హైటెక్ - మాదాపూర్
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ | అలంకార్ (ప్రతాప్) - లంగర్‌హౌస్
విమల్ 70ఎంఎం - బాలానగర్ | ముక్తవిజలక్ష్మి 70 - శంషాబాద్
అంజలి 70ఎంఎం - సికింద్రాబాద్ | VLS శ్రీదేవి 70 - చిలకలగూడ
కుమార్ 70ఎంఎం - కాచిగూడ | గోకుల్ 70 ఎ/సి - ఎర్రగడ్డ
సుష్మ 70ఎంఎం - వనస్థలిపురం | వైజయంతి 70 - నాచారం
ఇంద్రనాగేంద్ర 70 - కర్మన్‌ఘాట్ | సూపర్ 70 - బాలాపూర్
భుజంగ 70ఎంఎం - జీడిమెట్ల | నర్తకి 70 ఎ/సి - అల్వాల్
శ్రీ సాయిరాం 70 - మల్కాజ్‌గిరి | శ్రీకృష్ణ 70 - హోలియాబాద్
జ్యోతి 70 ఎ/సి - ఆర్‌సిపురం | వెంకటేశ్వర 70 - గుమ్మడిదల
శ్రీ కృష్ణ 70 ఎ/సి - ఉప్పల్ | శివరంజని 70 - ఇస్నాపూర్
తాళ్కూరి 70 - ఇసిఐఎల్ | ముకుంద్ 70 - మేడ్చల్
ప్రసాద్స్ - ఎన్.టి.ఆర్ గార్డెన్స్ | జిఎస్ఎమ్ - మదీనగూడ
ఎ.ఎం.బి. - గచ్చిబౌలి | నెక్లెస్ సత్య - కవాడిగూడ
సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట | అశోకా మాల్ - కూకట్‌పల్లి వై జంక్షన్
ఫోరం మాల్ - కూకట్‌పల్లి | మంజీరామాల్ - కూకట్‌పల్లి | లక్ష్మీనరసింహ - మియాపూర్
ఆర్.కె. - బంజారాహిల్స్ | పి.పి.పి.ఎల్ - మల్కాజ్‌గిరి | రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
ఇనార్బిట్‌మాల్ - మాదాపూర్ | మంత్రామాల్ - అత్తాపూర్ | జిపిఆర్ మాల్ - కూకట్‌పల్లి



జ్యూలైన్లలో బారులుదీరిన భక్తులు



రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 2: దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామి వారి ని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందుగా రాజరాజేశ్వర స్వామివారిని దర్శించు కునే ఆనవాయితీలో భాగంగా కొద్ది వారాలుగా భారీ సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేలాది మంది భక్తులు వేములవాడకు చేరుకున్నారు. ఆలయ కల్యాణ కట్ట లో తలనీలాలు సమర్పించి ధర్మ గుండంలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం సర్వ దర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని స్వామి వారిని దర్శించుకొని తరించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు.

శుక్రవారం సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపి వేసి లఘు దర్శనం అమలు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా కోడె మొక్కు చెల్లింపు కోసం గంటల కొద్దీ సమయం పట్టింది. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసి పోయింది. భక్తులు అమ్మ వారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నా రు. భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

అలరించిన శాస్త్రీయ సంగీతం

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవ స్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామివారి ఆరాధన ఉత్సవాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. నాలుగో రోజు శుక్రవారం ఉదయం బాలం భారతి భాగవ తారిణి, సురేఖ భాగవతారిణి హరికథ గానం చేశారు. మధ్యాహ్నం సీహెచ్ రఘు నందన్ సంగీత కచేరి నిర్వహించారు.

సాయంత్రం జయప్రద రామ్మూర్తి వేణువు సోలో కచేరితో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. అనంతరం ఉన్నికృష్ణన్ శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. రాత్రి శాంకరి నృత్య బృందానికి చెందిన వై.విజయ వల్లి నృత్య ప్రదర్శన నిర్వహిం చారు. చివరగా కె.రాజా బృందం భక్త ప్రహ్లాద పౌరాణిక నాటక ప్రదర్శనతో ఆకట్టుకుంది.





యువతుల సాంస్కృతిక ప్రదర్శన, ఉన్నికృష్ణన్‌ను సన్మానిస్తున్న ఆలయ అధికారులు

లక్ష్మీ నరసింహుని సన్నిధిలో మంత్రి దామోదర రాజనర్సింహ పూజలు





ధర్మపురిలో పూజలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, కుటుంబ సభ్యులు, ఆలయం పక్షాన మంత్రికి ఆశీర్వచనం, శేష వస్త్ర, ప్రసాదాలు అందజేత

ధర్మపురి, ఫిబ్రవరి 2: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ కుటుంబ సమేతంగా శుక్రవారం ఉద యం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకా రం వేదపండితులు, అర్చకులు, సిబ్బంది వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, స్థానిక వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వారిని ఘనంగా ఆశీర్వదించారు.

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహుకరించి సత్కరించారు. యాగశాల వద్ద నిర్వ హించిన నరసింహ హోమంలో మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో స్వామి వారి నిత్య కల్యా ణంలో మంత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందించి ఆలయం పక్షాన స్వామి శేషవస్త్ర, ప్రసాదాలు అందించి సత్కరించారు.

నరసింహుని దర్శనం ఆనందంగా ఉంది

లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం ఆనందంగా ఉం దని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. స్వామి దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో ఆయన కొద్ది సేపు విలేకరులతో మాట్లాడారు. శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తన ఇళ వేల్పు అన్నారు. స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఆలయంలో నిర్వహించే నిత్య అన్నదానం కోసం ఆయన రూ 1,00,000 విరాళాలు అందించారు. అలాగే బ్రాహ్మణ సంఘం అభివృద్ధి కోసం ఆయన రూ 1,01,000 విరాళాలు అందించారు.

బీఆర్‌ఎస్ పాలనలో ప్రజల ఆకాంక్షలు నిర్వీర్యం

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

రాష్ట్రంలో తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజల ఆకాం క్షలు నిర్వీర్యమయ్యాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో శుక్రవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్‌ఎస్ పాలనలో ఏళ్ల తరబడి అనేక ఇబ్బం దులు పడ్డ ప్రజలు ఆ పాలన నుంచి విముక్తి కోసమే కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. కాం గ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలకు కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే ఒక్కొక్క గ్యారెంటీ పథకాన్ని అమలు చేసి ప్రజాసంక్షేమ పాలన అంది స్తుందన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య సేవల మెరుగుద లపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. విద్య, వైద్య రంగాల్లో ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. సిబ్బంది నియామకాల ప్రక్రియ అనేది అర్హులైన స్థానికులతో భర్తీ చేయడం కోసం జిల్లా యంత్రాగానికి అప్పగించే దిశగా ఆలోచిస్తున్నా మన్నారు. పలు జిల్లాల్లోని 22 నియోజకవర్గాలు కోల్ బెల్ట్ పరిధిలో ఉండగా పరిశ్రమలు మాత్రం లేవన్నారు.

సింగరేణి సీఎస్ఆర్ నిధులు కేటాయిం చాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించడం కోసం వెళితే పోలీసులను పెట్టి అడ్డుకున్నారన్నారు. తాము ఎవరిని విమర్శించడం లేదని, కేవలం ఆత్మ విమర్శ చేసుకోవాలని అంటున్నామని ఆయన తెలిపారు. ధర్మపురికి వైద్య పరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వం లో ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఈ విషయంలో అడ్వకేట్ జనరల్, న్యాయవాదులు సుప్రీం కోర్టులో వాదనలు వినిపిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

రైలు కింద పడి వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 2: జమ్మికుంట మండలం బిజిగిరి షరీఫ్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి ఎక్స్‌ప్రెస్ రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కింద పడి శుక్రవారం అక్కడికి అక్కడే మృత్యువాత పడ్డాడు. ఓడిశా రాష్ట్రం బలంగీర్ జిల్లా భారుపాలి గ్రామానికి చెం దిన గోపాల్ ఛాత్రీయా (43) తన కుమారుడు, కుమార్తెతో కలిసి ఎక్స్‌ప్రెస్ రైల్లో ఎక్కి జనరల్ కోచ్‌లో సికింద్రాబాద్‌కు వస్తున్నాడు. మార్గ మధ్యలో బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ సమీపంలో ప్రమాదవ శాత్తు కిందపడి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య ద్రౌపతి, ఇద్దరు కుమా రులు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



సాగర్

ముస్తాబాద్, ఫిబ్రవరి 2: మండలంలోని మోర్రా యిపల్లె గ్రామానికి చెందిన గూడ సాగర్ (18) శుక్ర వారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాగర్ ఇంటర్ పూర్తి చేసి ఢిల్లీలో కంప్యూటర్‌పై శిక్షణ తీసుకొని వచ్చాడు. తిరిగి ఢిల్లీ వెళ్లే క్రమంలో ఉద్యోగం వస్తాదో? రాదో?నని మనస్తాపం చెందాడు. గ్రామానికి సమీపంలోని కోళ్ల ఫారంలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లాత్ స్టోర్‌లో అగ్ని ప్రమాదం

రూ.3 లక్షల ఆస్తి నష్టం

కొడిమ్యాల, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోని శ్రీ సుమంగళి క్లాత్ స్టోర్‌లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరి గినట్లు బాధితుడు బుర్ర సంతోష్ పోలీ సులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో దుకాణంలో ఉన్న పట్టు చీరెల తో పాటు ఫర్నిచర్ కాలిపోయినట్లు బాధితు డు తెలిపాడు. ప్రమాదం ఎలా జరిగింది అనేది తెలియటం లేదు. సంఘటన స్థలా న్ని హెడ్ కానిస్టేబుల్ అర్జరాజు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ వి. రవీందర్ పరిశీలించారు.



10న 'నవోదయ' ప్రవేశ పరీక్ష

చొప్పదండి, ఫిబ్రవరి 2: నవోదయ విద్యాలయం లో 9, 11 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 10న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మంగ తాయారు ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం 1,745, 11వ తరగతిలో ప్రవేశాలకు 1,144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నార న్నారు. వీరి కోసం కరీంనగర్‌లో 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హాల్ టికెట్‌లను ఆన్ లైన్‌లో ఉంచామని, డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏమై నా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

గురుకుల సీవోఈ ఇంటర్ ప్రవేశ పరీక్ష రేపు

మానకొండూర్, జనవరి 2: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గురుకుల సీవోఈ ఇంట ర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష ఈ నెల 4న నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలల డీసీవో శ్రీని వాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియట్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థు లు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఆది వారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలనికోరారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య

ధర్మారం, ఫిబ్రవరి 2: ధర్మారం మండలం ఖిలావన పర్తి గ్రామానికి చెందిన భూతగడ్డల వసంత (29) అనే వివాహిత గురువారం సాయంత్రం కడుపునొప్పి బాధ భరించలేక పురుగుల మందు ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై సత్యనారాయణ తెలిపారు. మూ డేళ్ల నుంచి ఆమె కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో గురువారం తీవ్రంగా కడుపునొప్పి రావడం తో బాధ భరించలేక సాయంత్రం పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలుకు వైశాలి (10), గునజ(6)కు మార్తెలున్నారు. శుక్రవారం మృతు రాలి సోదరుడు నూనె మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సత్య నారాయణ తెలిపారు.

ద్విచక్రవాహనాలు ఢీ ముగ్గురికి గాయాలు

మానకొండూర్, ఫిబ్రవరి 2: మండలంలోని పోచం పల్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని మంకమ్మతోట కుచెందిన ఎదులాపురం జగన్(58), మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన పొట్టాల లక్ష్మయ్య(50), పని నిమిత్తం పోచంపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నారు. పచ్చునూర్‌కు చెందిన ఎరవెల్లి కు మార్(40) కరీంనగర్ నుంచి పచ్చునూర్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రి కి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కరీంనగర్ క్రైం. ఫిబ్రవరి 2: కరీంనగర్ కశ్మీర్‌గడ్డ ప్రాంతంలో గత నెల 30న మంటలు అంటుకుని కాలిన గాయాలతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొం దుతున్న ఎండీ ఖాసీం(55) శుక్రవారం మృతి చెందాడని రెండో ఠాణా సీఐ ఓ వెంకటేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఖాసీం జనవరి 30న ఇంటి వద్ద ఉన్న సమయంలో అతని బట్టలపై శానిటైజర్ బాటిల్ పడింది. కొద్దిసేపటి తరు వాత ఖాసీం బయటకు వచ్చి బీడీ తాగేందుకు అగ్గి పుల్లను వెలిగించగానే అతనికి ఒంటిపైన బట్టలకు మం టలు అంటుకున్నాయి. స్థానికులు మంటలను ఆర్పివేసి ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత ఎంజీఎంకు తరలిం చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కొడుకు మహ్మద్ ఫహద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలి పారు. కాగా ఖాసీం కొడుకుపై స్థానిక నాయకులు అక్రమ కేసు పెట్టించి జైలుకు పంపించటంతో మన స్తాపంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని సోషల్ మీడియా లో ప్రచారం జరుగుతున్నది.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని, ఫిబ్రవరి 2: ఎన్టీపీసీలో ఈనెల 6న నిర్వహించే రామగుండం నియోజకవర్గస్థాయి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ సన్నాహక సమావేశాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ కోరారు. శుక్రవారం గోదావరిఖని చౌరస్తాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్లమెంటరీ సన్నాహక సమావేశాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా పార్లమెంట్ సన్నాహక సమావేశం ఈనెల 6న జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్ హాజరవుతారని చందర్ చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామ, పట్టణ డివిజన్ల అధ్యక్షులు, అధికార ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, మహిళా, మైనార్టీ, విద్యార్థి, యువజన విభాగం నాయకులు కార్యకర్తలను అధిక సంఖ్యలో తరలించి సమావేశాన్ని విజయవంతం చేయాలన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రం గణనీయంగా అభివృద్ధి సాధించిందని, తాను కూడా గడిచిన ఐదేళ్ల పదవీకాలంలో డీఎంఎఫ్‌టీ, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి, సీఎం ప్లాన్ గ్రాంట్ నిధులతో రామగుండం నియోజవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చానన్నారు. తన హయాంలో ప్రారంభించిన రోడ్లు, భవనాలను మళ్లీ ప్రారంభించడం సరికాదని, పురోగతిలో ఉన్న పనులను తొందరగా పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత హయంలో అభివృద్ధి ఏమి జరుగలేదని ప్రస్తుత ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆరోపించడం మానుకోవాలని చందర్ సూచించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి మూల విజయారెడ్డి, కార్పొరేటర్లు పెంట రాజేష్, కుమ్మరి శ్రీనివాస్, నాయకులు గోపు ఐలయ్యయాదవ్, మెతుకు దేవరాజ్, అచ్చె వేణు, నారాయణదాసు మారుతి, బొడ్డుపెల్లి శ్రీనివాస్, జాహెద్‌పాషా, చల్లగురుగుల మొగిలి, చల్లా రవీందర్‌రెడ్డి, సన్ని, నిట్టూ రాజు, శ్రావణ్, స్వప్న, జడ్సన్ రాజు, తోకల రమేష్, గఫూర్ పాల్గొన్నారు.

నకిలీ ఏటీఎం కార్డుతో లక్ష రూపాయలు మాయం?

- లబోదిబోమంటున్న బాధితులు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 2: ఖాతాదారుల ప్రమేయం లేకుండా వారి డబ్బులు దండుకునే సైబర్ నేరస్థులు ప్రస్తుతం కొత్త రకం మోసాలకు తెరతీస్తున్నారు. ఏటీఎం కార్డు సదరు ఖాతాదారుని వద్దనే ఉన్నా నకిలీ కార్డుల సాయంతో ఏటీఎంలలోనే డబ్బులు డ్రా చేసుకుపోతున్న దొంగల ఉదంతమిది. తమ ప్రమేయం లేకుండానే తమ కార్డు తమ వద్దనే ఉన్నా ఖాతా నుంచి లక్షా మూడు వేల రూపాయల నగదును డ్రా చేసుకున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బంధువులు కొంత నగదును ట్రాన్స్‌ఫర్ చేయడంతో వాటి వివరాలు తెలుసుకోవడానికి శుక్రవారం బ్యాంక్‌కు వెళ్లగా ఈ మోసం వెలుగుచూసింది. దాంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఇటు బ్యాంకు అధికారులను ఆశ్రయించి తమ డబ్బులు ఇప్పించాలని వేడుకుంటున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన రాచకట్ల అనుపమ స్వామి దంపతులు కూలీ పని చేసుకుని తమ కూతురును ఉన్నత చదువులు చదివించడానికి పైసాపైసా కూడపెడుతున్నారు. స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో తమ ఖాతాలో డబ్బులు జమ చేసుకుంటున్నారు. మూడు నెలల క్రితం నవంబర్ 14న బ్యాంకుకు వెళ్లి తమకు కొత్తగా వచ్చిన ఏటీఎం కార్డును యాక్టివేట్ చేయించుకుని ఐదు వందల రూపాయలను డ్రా చేసుకున్నారు. మళ్లీ అప్పటి నుంచి ఇప్పటి వరకు తాము మళ్లీ బ్యాంకుకు వెళ్లింది లేదని, డబ్బులు డ్రా చేసింది కూడా లేదని, ఏటీఎం కార్డు, పాస్‌బుక్కు అన్ని మా వద్దను ఉన్నాయన్నారు. అయితే డిసెంబర్ 30న తమ బంధువులు బసంత్‌నగర్ నుంచి తమ ఖాతాలో మూడు లక్షలకు పైగా నగదును టాన్స్‌ఫర్ చేశారని, ఈ విషయమై తాము శుక్రవారం ఉదయం బ్యాంకు వెళ్లి తమ ఖాతాలో జమ అయిన డబ్బుల వివరాలను తెలుసుకున్నామన్నారు. కానీ దాంతో పాటే పదమూడు సార్లు తమ ఖాతా నుంచి డబ్బులు డ్రా అయినట్లు బ్యాంకు అధికారులు తెలుపడంతో తాము షాక్‌కు గురయ్యామన్నారు. తాము ఒక్కపైసా కూడా డ్రా చేసుకోలేదని తెలుపగా తమ కార్డుతో మహారాష్ట్రలో ఏటీఎం నుంచి డబ్బులు డ్రా అయినట్లు బ్యాంకు అధికారులు తెలిపారన్నారు. కానీ తమ ఏటీఎం కార్డు తమ వద్దనే ఉందని, ఇది మోసం అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంకు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుల ఖాతాకు సంబంధించిన వారి ఏటీఎం కార్డుతోనే జనవరి 15న సుల్తానాబాద్ ఏటీఎం నుంచి ఐదు వేలు రూపాయలు డ్రా కాగా, మిగతా పన్నెండుసార్లు మహారాష్ట్రలోని రాజూర జిల్లా చంద్రాపూర్‌లోని ఏటీఎంల నుంచి మొత్తం ఒక లక్షా మూడు వేల రూపాయలు డ్రా చేసుకున్నారు. దీంతో నకిలీ ఏటీఎం కార్డు సృష్టించారని బాధితులు బ్యాంకు అధికారుల భావిస్తున్నారు. పోలీసులు బ్యాంకు అదికారులు తమ డబ్బులను ఇప్పించాలని వారు వేడుకుంటున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

- కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలుచేయకుంటే ఉద్యమించాలి - ఎమ్మెల్సీ మధుసూదనాచారి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

మంథని, ఫిబ్రవరి 2: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిపించుకోవటానికి బీఆర్ఎస్ పార్టీ సత్తాను చాటేందుకు పార్టీ క్యాడర్ సమయాత్తం కావాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ మంత్రి కొప్పల ఈశ్వర్‌లు పిలుపునిచ్చారు. స్థానిక ఎస్ఎల్‌బీ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు అధ్యక్షతన శుక్రవారం జరిగిన నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేవలం సీట్లు, ఓటు బ్యాంకు మాత్రమే పెంచుకుంటామనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ అమలు సాధ్యంకాని హామీలను ప్రకటించిందన్నారు. తీరా వారు కూడా ఊహించని విధంగా అధికారంలోకి రావడంతో అమలుకు సాధ్యంకాని హామీలతో గందరగోళంగా పాలన నిర్వహిస్తున్నారని ఏద్దేవా చేశారు. ఈ విషయాన్ని ప్రజలు కూడా గమనించి ఎందుకు ఓటువేసామని బాధపడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి అసలు నాయకుడు లేకనే పూటకో పార్టీ మారే రేవంత్‌రెడ్డిని సీఎం చేసి పార్టీని అప్పగించారన్నారు. దేశంలో ఎక్కడ లేని 20 శాతం వృద్ధి రేటు తీసుకువస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 2నెలల కాలంలోనే కరెంట్ కోతలంటే తెలియని తెలంగాణలో కరెంట్ కోతలు మొదలయ్యాయని, రైతుబంధు రాక, సాగునీరు అందక పచ్చనిపొలాలు బీళ్లుగా మారుతున్నాయన్నారు. రుణమాఫీ, రైతు బంధు ఊసేలేదన్నారు. ఫిబ్రవరి 1వ తేదీన గ్రూప్-1తీ నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఫిబ్రవరి 2వ తేదీన దాటినా దాని ఊసే తీయడం లేదు. కాంగ్రెస్ పార్టీకి అధికారంలోకి వచ్చే ముందు తెలంగాణ ప్రజలకిచ్చింది ఆరు గ్యారెంటీలు కాదని.. 420 హామీలు అని.. మార్చి 17వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలు అమలుకాకపోతే ఉద్యమించుడే హెచ్చరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాల ద్వారా ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగుల నింపాలని కేసీఆర్ సంకల్పించినప్పటికి పథకాలపై ప్రజల్లో, క్యాడర్‌లో సరైన అవగాహన లేకపోవడం ఓటమి చవిచూడటం బాధాకరమన్నారు.

పార్లమెంట్ ఎన్నికలలోపే నన్ను చంపాలని కుట్ర..

- నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు..

పార్లమెంట్ ఎన్నికలలోపే తనను చంపాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోందని బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు సంచలన వ్యాఖ్యలతో ఆరోపించారు. ఇందులో భాగంగానే తనను జడ్పీ చైర్మన్ పదవి నుంచి తప్పించడంతోపాటు తనకున్న వ్యక్తిగత గన్‌మెన్‌లను తొలగించాలని కుట్రలు చూస్తున్నారన్నారు. జడ్పీటీసీలను సైతం కొనుగోలు చేయాలని ప్రయత్నం చేశారన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవతీసుకొని వారి వ్యూహాలను తిప్పికొట్టారన్నారు. తన పదవి తొలగించలేక మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న తన సతీమణి పుట్ట శైలజపై అవిశ్వాసం పెట్టేందుకు తెరలేపారని, 2018, తాజా అసెంబ్లీ ఎన్నికల సమయాల్లో తనపై అనేక అసత్య ఆరోపణలు చేసి విజయం సాధించారని, తాను వందల కోట్లు ఆస్తులు కూడబెట్టానని, వందలాది ఇసుక లారీలు ఉన్నాయని ఆరోపణలు చేశారని, ప్రస్తుతం అధికారంలో వారే ఉన్నారని తన అక్రమ ఆస్తుల వివరాలు బయటపెట్టాలని, వందలాది ఇసుక లారీలను చూపెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు విచ్చలవిడిగా మందు, డబ్బులు పంచి ప్రజలను మభ్యపెట్టి విజయం సాధించారు. నోట్లకట్టలు, మద్యం ఏరులై పారినా మంథని నియోజకవర్గంలోని ప్రజలు 72 వేల ఓట్లు వేసి తమ మద్దతు తెలుపడం ఆనందంగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలకు అండగా ఉంటానని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండాఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని కోరారు. ప్రమాదశాత్తు మృతి చెందిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రూ.2లక్షల బీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తగరం శంకర్‌లాల్, ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం సుమలత, కర్రు నాగయ్య, ఎక్కటి ఆనంతరెడ్డి, జక్కు రాకేష్, ఆరెపల్లి కుమార్, ఆకుల కిరణ్ పాల్గొన్నారు.

పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ టికెట్‌కు దరఖాస్తు

- మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసిన మాజీ ఎంపీ సుగుణ కుమారి



దరఖాస్తు అందజేస్తున్న సుగుణకుమారి

పెద్దపల్లి(ఆంధ్రజ్యోతి), గోదావరిఖని, ఫిబ్రవరి 2: పెద్దపల్లి పార్లమెంట్ రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. పెద్దపల్లి మాజీ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ చెలిమెల సుగుణ కుమారి అనూహ్యంగా మళ్లీ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. దుబాయిలో డాక్టర్‌గా పని చేస్తున్న సుగుణకుమారి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో దిగారు. శుక్రవారం గాంధీ భవన్‌కు వెళ్లి పెద్దపల్లి పార్లమెంట్ నుంచి వచ్చే ఎన్నికల్లో తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. గురువారమే మంత్రి శ్రీధర్‌బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిశారు. 1998, 2000సంవత్సరం వరకు 13సంవత్సరాలు ఆమె పెద్దపల్లి పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేశారు. 2000సంవత్సరం నుంచి 2004 వరకు ఆమె ఎంపీగా కొనిసాగారు. టీడీపీ అభ్యర్థిగా వెంకటస్వామిని రెండుసార్లు ఓడించి రెండుసార్లు పెద్దపల్లి పార్లమెంట్ నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఆ సందర్భంలో ఆమె తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలిగా కూడా కొనసాగారు. జాతీయ రైల్వే కన్వేక్షన్ కమిటీ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. సుగుణ కుమారి ఆకస్మిక రాజకీయ రంగ ప్రవేశంతో కాంగ్రెస్ పార్టీ నుంచి పార్లమెంట్ సభ్యత్వం ఆశిస్తున్న నాయకులకు గట్టి పోటీ ఏర్పడింది.

దరఖాస్తు సమర్పించిన ఊట్ల వరప్రసాద్..

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వాలని యువజన కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ శుక్రవారం హైదరాబాద్‌లో గాంధీభవన్‌లో దరఖాస్తు అందజేశారు. ఎన్ఎస్‌యూఐ ద్వారా రాజకీయ అరంగేట్రం చేసి యువజన కాంగ్రెస్‌లో పలు పదవులు చేపట్టానని, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు అధికంగా ఉంటారని, తాను కూడా అదే సామాజికవర్గానికి చెందిన వారినని, తనకే టికెట్ ఇవ్వాలని కోరారు.

మాజీ సర్పంచ్‌లకు ఘన సన్మానం

ధర్మారం, ఫిబ్రవరి 2: మండలంలోని రచ్చపల్లి సర్పంచ్ మోర సుధాకర్ పదవీ కాలం ముగియడంతో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : మండలంలోని అందుగులపల్లిలో సర్పంచ్, పాలకవర్గానికి శుక్రవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ కారే శారదశ్రీనివాస్, ఉపసర్పంచ్ తలారి స్వప్నతోపాటు వార్డుసభ్యులను ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీ పందిళ్ల లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి కిషోర్, సీఏలు, ఆశ కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. పెద్దకల్వలలో మాజీ సర్పంచ్ కారెంగల రమేష్, ఉపసర్పంచ్ అర్కుటి సంతోష్ వార్డు సభ్యులను ఘనంగా సత్కరించారు.

జూలపల్లి, ఫిబ్రవరి 2 : మండలంలోని కీచులాటపల్లి గ్రామం మాజీ పంచాయతీ పాలకవర్గ సభ్యులను శుక్రవారం అధికారులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ప్రత్యేక అధికారి శ్రవంతి, మాజీ సర్పంచు కొత్త శకుంతల, కార్యదర్శి రవిందర్, కొత్త రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులకు సన్మానం

పాలకుర్తి, ఫిబ్రవరి 2: మండల వ్యాప్తంగా ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు స్వీకరించిన పలు శాఖలకు చెందిన అధికారులకు శుక్రవారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల ప్రజలు, యువకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఘనంగా సన్మానించారు.



సమ్మె నోటీస్ అందజేత



వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 2: సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్జీ-2 యాజమాన్యానికి సమ్మె నోటీస్ అందజేసింది. గురువారం డివిజన్ అధ్యక్షుడు కుంట ప్రవీణ్ ఆధ్వర్యంలో డీజీఎం పర్సనల్‌కు నోటీస్‌ను అందజేశారు. ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సీఐటీయూ మద్దతు తెలుపుతున్నదని, కార్మికులు సమ్మెలో పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఒకరోజు సమ్మె చేయనున్నట్టు తెలిపారు. సింగరేణిలో జేఏసీగా ఏర్పడి సమ్మెకు వెళ్లనున్నట్టు, పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొననున్నట్టు తెలిపారు. సమ్మె నోటీస్ ఇచ్చిన వారిలో రాంసాగర్, రాంప్రసాద్, రమేష్, విజ్ఞేష్, శ్రవణ్, శ్రీధర్, జగదీష్, కిషోర్ ఉన్నారు.

ఆర్జీ-3లో..

రామగిరి, ఫిబ్రవరి 2: సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న జరిగే సార్వత్రిక సమ్మె విజయవంతానికి శుక్రవారం ఆర్జీ-3 ఎస్‌వోటూ జీఎం రఘుపతికి ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు అశోక్, సతీష్, పాషా, రాజేందర్, రత్నాకుమార్ రవీందర్, చంద్రయ్య, దామోదర్‌రెడ్డిలు వినతిపత్రం అందజేశారు. రమేశ్, రజిత, కనకలక్ష్మి పాల్గొన్నారు.



ఎస్‌వోటూ జీఎంకు వినతిపత్రం అందిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు కృషి చేయాలి

- 60రోజుల్లో 14మిలియన్ టన్నుల లక్ష్యం - సీఎండీ బలరాంనాయక్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాంనాయక్

గోదావరిఖని, ఫిబ్రవరి 2: సింగరేణి సంస్థ వార్షిక లక్ష్యం బొగ్గు ఉత్పత్తి చేసేందుకు కేవలం రెండు నెలల సమయమే ఉండడంతో సీఎండీ బలరాంనాయక్ శుక్రవారం సింగరేణిలోని జీఎంలందరికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఫిబ్రవరి, మార్చి మసాల్లో 60రోజుల్లో 140లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. రోజూ సంస్థ 2.3లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి ఉత్పత్తి చేయాలని, దేశ ఇంధన అవసరాల కోసం అదే స్థాయిలో రవాణా కూడా జరుపాలని సీఎండీ పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ఎంచుకున్న 70మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలంటే 60రోజుల్లో మరో 14మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. ఇందుకోసం అందరూ సమష్టిగా, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆయన ఆదేశించారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి అన్ని డివిజన్ల జీఎంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ సుదీర్ఘంగా చర్చించారు. ఉత్పత్తి పురోగతి, నూతన ప్రాజెక్టులపై నిర్వహించే సమీక్షలో భాగంగా సీఎండీ సింగరేణి ఉత్పత్తి, రవాణానే ప్రధానంగా తీసుకున్నారు. రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్ గరిష్ఠంగా పెరుగుతుందని, ఈ నేపథ్యంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిరాటకంగా విద్యుత్ ఉత్పత్తి చేయడానికి వీలుగా సింగరేణితో ఒప్పందాలు చేసుకున్నాయని, ఒప్పందంలో ఉన్న అన్ని విద్యుత్ కేంద్రాలకు తగినంతగా బొగ్గు రవాణా చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తి, రవాణా ఆశాజనకంగానే ఉందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. గడిచిన పది నెలల కాలంలో 56.7మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా 56.3మిలియన్ టన్నులు సాధించగలిగామన్నారు. గత సంవత్సరం ఇదే సమయానికి సాధించిన ఉత్పత్తి లక్ష్యంపై నాలుగు శాతం వృద్ధితో ఉన్నామన్నారు. ప్రస్తుత సంవత్సరం 56.7మిలియన్ టన్నుల బొగ్గు రవాణా లక్ష్యంగా నిర్దేశించుకోగా 57.23 మిలియన్ టన్నుల రవాణా చేశామని, గత ఏడాదితో పోల్చుకుంటే ఇది 6శాతం వృద్ధి అని వెల్లడించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు సింగరేణిలో 344మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించామని, గత ఏడాదితో పోల్చితే ఇది కూడా 4శాతం వృద్ధిలో ఉందని సీఎండీ చెప్పారు. ప్రస్తుత సంవత్సరం ఓబీ రోజుకు 15.6లక్షల క్యూబిక్ మీటర్లు తొలగించాల్సి ఉందన్నారు. ప్రధానంగా భూపాలపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఉత్పత్తి పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆ ఏరియాల జీఎంలను ఆదేశించారు. ఓబీ కాంట్రాక్టర్ల పని తీరుపై ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. నూతన ప్రాజెక్టులపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టాలనుకున్న ఒరిస్సాలోని నైని కోల్‌బ్లాక్, కొత్తగూడెం ఏరియాలోని వీకే కోల్‌మైన్, బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి ఓసీ, ఇల్లందు ఏరియా జేకే ఓసీ గనుల ప్రారంభానికి కావాల్సిన అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎండీ ఆదేశించారు. మొత్తం 19.80 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న ఈ ఓసీ గనులను వీలైనంత త్వరగా ప్రారంభించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రారంభం కావాల్సిన ఆర్జీ-3 ఏరియాలోని ఆర్జీ కోల్‌మైన్, బెల్లంపల్లి ఏరియాలోని ఎంవీకే ఓసీపీకి సంబంధించిన అనుమతుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణరావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి, అధికారులు జే అల్విన్, ఎం సురేష్, జక్కం రమేష్, దేవేందర్, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేట్ జీఎంలు పాల్గొన్నారు.

ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా సీతారామయ్య



వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని, ఫిబ్రవరి 2: ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షునిగా సింగరేణి ప్రాంత నాయకుడు వాసిరెడ్డి సీతారామయ్య ఎన్నికయ్యారు. గురువారం రాంచిలో ఫెడరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీతారామయ్యను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. సీతారామయ్య గత 30ఏళ్లుగా బొగ్గుగని కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్నాడు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. గత డిసెంబర్‌లో జరిగిన సింగరేణి ఎన్నికల్లో యూనియన్‌ను సీతారామయ్య విజయ పథంలో నడిపించారు. ఏఐటీయూసీకి అనుబంధంగా ఉండే ఇండియన్ మైన్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షునిగా సీతారామయ్య ఎన్నికపై సింగరేణి ఏఐటీయూసీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. కాగా, ఫెడరేషన్ అధ్యక్షుడిగా ఇంతవరకు డబ్ల్యూసీఎల్ మహారాష్ట్రకు చెందిన జోసఫ్ అధ్యక్షుడిగా కొనసాగారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన

ధర్మారం, ఫిబ్రవరి 2: మండల కేంద్రంలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నందిమేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీపీఎంవో ప్రకాష్‌రావు, పీహెచ్ఎన్ విజయలలిత, హెచ్ఎస్ జీవరాణి, హెచ్ఎస్ జయ, హెచ్ఏ దామోదర్‌రెడ్డి, ఏఎన్ఎం జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ అనంతరామకృష్ణ, ఆశా వర్కర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పండ్లు పంపిణీ

ధర్మారం, ఫిబ్రవరి2: మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేసిన సుధారాణి మృతిచెందగా శుక్రవారం ఆమె జన్మదినోత్సవం సందర్భంగా కుటుంబ సభ్యులు 4అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుధారాణి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ హెచ్‌ఎంకు సన్మానం

ధర్మారం,ఫిబ్రవరి2: మండలంలోని కటికెనపల్లి ప్రాథమిక పాఠశాలలో 1965 నుంచి 1967 వరకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన రాపర్తి వెంకటేశ్వర్లు శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఉద్యోగ విరమణ పొంది కరీంనగర్‌లో స్థిరపడిన ఆయన 57ఏళ్ల తర్వాత పాఠశాలకు వచ్చిన సందర్భంగా ఆయనను పాఠశాల తరఫున ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు నూతి మల్లయ్య, నిమ్మల రేవతి, సొన్నం సంధ్య సన్మానించారు.

'మదర్ థెరిసా' విద్యార్థుల క్షేత్ర సందర్శన

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ వారి ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఇన్ఫోసిస్ కంపెనీ ఆహ్వానం మేరకు సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు తమ సందేహాలను కంపెనీ అనుభవజ్ఞులైన ఉద్యోగులచే నివృత్తి చేసుకున్నారు. కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్, డైరెక్టర్ ఏ నవత, ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాస్, అకౌంట్స్ అధికారి పి.పవన్ కుమార్, ప్లేస్మెంట్ ఆఫీసర్ కె వెంకటేశ్వర్లు, విభాగపు అధిపతులు బూర్ల శ్రీనివాస్, ఆడిచర్ల రమేష్, వంశిరాజ్, నికిత, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంతయ్య

జూలపల్లి, ఫిబ్రవరి 2 : మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మామిడిపెల్లి కాంతయ్యను బీఎస్పీ జిల్లా ప్రధానకార్యదర్శిగా అధ్యక్షుడు ఇరికిల్ల రాజనర్సయ్య నియమించారు.తన నియామకానికి సహకరించిన బీఎస్పీ పెద్దలందరికి కృతజ్ఞతలు తెలిపాడు.

సుందరకాండ పారాయణం ప్రారంభం

మంథని, ఫిబ్రవరి 2: మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలో ప్రసిద్ధిగాంచిన శ్రీభలవీర హనుమాన్ దేవాలయంలో సుందరకాండ పారాయణాన్ని శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. సుందరకాండ పారాయణంతో పాటు మన్యూసూక్త జపము, అష్టోత్తర శత కలశ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీగణపతి పూజ స్వస్తి పుణ్యాహ వచనము, మాతృక అఖండ దీపారాధన, రిత్విక్ వరణము, దేవతా స్థాపనము, పారాయణ జపము, అగ్నిస్థాపనము, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలను వేదోక్తంగా నిర్వహించారు. నల్లగొండ మదనగోపాల్ శర్మ, బ్రహ్మశ్రీ దుద్దిల్ల మారుతి, శ్రీభలవీర హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న అధికారులు, నాయకులు

ఓదెల, ఫిబవ్రరి 2 : మండలంలోని కొలనూర్ గుట్టల్లోగల సమ్మక్క-సారలమ్మ గద్దెలను శుక్రవారం తహసీల్దార్ యాకయ్య, వివిధ పార్టీల నాయకులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఈనెల 21నుంచి 24 వరకు నిర్వహించనున్న వన దేవతల జాతర ఉన్నందున పరిసరాల్లో శుభ్రత పనులను పూర్తిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జాతర చైర్మన్ దేవిడి స్వామిరెడ్డి, వైస్‌చైర్మన్ కొల్లూరి రామచంద్రం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి బైరి రవిగౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రే సంజీవరెడ్డి,ఎడవెల్లి విజయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని వినతి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : మండలంలోని పెద్దబొంకూరు నుంచి ఓదెలకు వేస్తున్న డబుల్ రోడ్డు నిర్మాణం కొత్తపల్లికి వెళ్తుందని గ్రామానికి ఆనుకొని కల్వర్టులకు బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని శుక్రవారం ఆర్ అండ్ బీ అధికారులకు వినతిపత్రం అందించారు. డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా రొడ్యాంలకు బ్రిడ్జిలు సాంక్షన్ చేయాలని బాలసాని లెనిన్ కోరారు.

శిలాఫలకం వివాదంపై డీఈ విచారణ

రామగిరి, ఫిబ్రవరి 2: మండలంలోని నాగేపల్లి పనులకు సంబంధించిన ప్రోటోకాల్ వివాదంపై శుక్రవారం పంచాయతీ డీఈ జనార్దన్, పంచాయతీ సెక్రెటరీ గొర్రె సంతోష్‌లు శిలాఫలకాన్ని పరిశీలించారు. ఈ సమాచారం అందుకున్న స్థానిక ఎంపీటీసీ భర్త తీగల సమ్మయ్యతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు డీఈని సంప్రదించి తదుపరి చర్యలను అడిగారు. దీనిపై డీఈ స్పందిస్తూ శిలాఫలాకాలకు నల్లరంగును వేస్తామని తెలియజేయడంతో శిలాపలకాలను తొలగించాలని కోరడంతో సమాధానం చెప్పకుండా డీఈ వెళ్లిపోయారని కాంగ్రెస్ నాయకుడు తీగల సమ్మయ్య తెలిపారు.

విధుల్లో చేరిన ప్రత్యేకాధికారులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 2 : సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో జిల్లా కలెక్టర్ గ్రామ పంచాయితిలకు ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ సందర్భంగా మండలంలోని 30 గ్రామాలకు గాను ప్రత్యేక అధికారులను కేటాయించగా శుక్రవారం విధుల్లో చేరారు. తుర్కలమద్దికుంట గ్రామ ప్రత్యేకాధికారిగా ఎంపీడీవో రాజు విధుల్లో చేరారు. వీరితో పాటు పలు గ్రామాల్లో అధికారులు ప్రత్యేకాధికారులుగా విధుల్లో చేరారు.

రామగిరిలో..

రామగిరి, ఫిబ్రవరి 2: మండలంలో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి అయిన నేపథ్యంలో ఆయా గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారులు చార్జి తీసుకున్నారు. వారిని తాజా మాజీ సర్పంచ్‌లతో పాటు పంచాయతీ సెక్రెటరీలు, గ్రామస్తులు సత్కరించారు. దీంతో పాటుగా పదవీకాలం పూర్తిచేసుకున్న సర్పంచ్‌లకు, పాలక మండలి సభ్యులకు గ్రామస్తులు సత్కారాలు చేశారు.

ఉపాధిహామీ ఆవిర్భావ వేడుకలు

రామగిరి, ఫిబ్రవరి 2: మండలంలోని రత్నాపూర్‌లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలచే కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబుడ్స్‌పర్సన్ తిమ్మరాజు శరత్‌కుమార్, ఎంపీడీవో రమేశ్, ఇంచార్జి ఏపీడీ అమృత్‌కుమార్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్‌లు తొలగించాలి

రామగిరి, ఫిబ్రవరి 2: మండలంలోని బేగంపేట్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, దేవాలయాల ఎదుట నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌లపై ఎక్సైజ్ అధికారులకు శుక్రవారం స్థానికుడు దాసరి శివ ఫిర్యాదు చేశాడు. బెల్ట్‌షాప్‌ల నిర్వహణ కారణంగా విద్యార్థులు, భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదు పేర్కొన్నాడు. తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు.

రోడ్డు నాణ్యతపై విచారణకు ఆదేశాలు

ఓదెల, ఫిబ్రవరి 2 : మండలంలోని కనగర్తిలో బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత పరిశీలనకు సీఎం కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్‌కు ఆదేశాలు జారీచేశారు. గత డిసెంబర్ 22న హైదరాబాదులో ప్రజా భవన్ వద్ద నిర్వహించిన సీఎం ప్రజా దర్బార్‌లో రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపం ఉందని సతీష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. అలాగే ఫిర్యాదులో రోడ్డుకు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండా,మురికి కాలువలు లేకుండానే రోడ్డును నిర్మించారని పేర్కొన్నారు ఫిర్యాదు చేశారు. ఈమేరకు అదనపు కలెక్టర్, జిల్లా పీఆర్ ఇంజనీర్‌లను రోడ్డు నాణ్యతను పరిశీలించి వారంలోపు నివేదిక సమర్పించాలని ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదారుడు మాట్లాడుతూ రోడ్డు నాణ్యత పరిశీలన, విచారణ గ్రామస్తుల సమక్షంలో నిర్వహించాలని కోరారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 2: పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అప్పుడే వాటిని నియంత్రణకు ఆస్కారం ఉంటుందని రామగుండం సైబర్ క్రైమ్ సీఐ కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని చైతన్య డిగ్రీ కళాశాలలో జరిగిన సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ వాడకం పెరిగిపోయిందని, దానితో సైబర్ నేరగాళ్ళు విపరీతంగా మోసాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా మెలగాలని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చేయవద్దని, అనవసరమైన లింక్‌లు క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఎవరైనా సైబర్ నేరాల బారినపడితే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ యాకాంతం, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.